## క్లుప్తంగా

### రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్



భీంభరత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన బొబ్బిలిగామ గ్రామానికి చెందిన నాయకులు

షాబాద్: రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని చేవెళ్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్ పేర్కొన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని బొబ్బిలిగామ గ్రామానికి చెందిన కొంత మంది నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడగానే ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామన్నారు.

### పెళ్లికి ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న సర్పంచ్ రమ్య

షాబాద్: పేద ప్రజలను ఆదుకునేందుకు తనవంతు కృషి చేస్తానని సోలిపేట సర్పంచ్ రమ్య రాంచంద్రారెడ్డి అన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని సోలిపేట గ్రామానికి చెందిన ఎండీ షరీఫ్ కూతురు పెళ్లికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.

### సమస్యలు పరిష్కరించాలని ధర్నా



తహసీల్దార్ సురేందర్‌కు వినతి పత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

శంకర్‌పల్లి: రైతు సమస్యలను పరిష్కరించాలని సంఘం పిలుపు మేరకు గురువారం శంకర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదట మండల రైతు సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సురేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం ఉపాధ్యక్షుడు, రంగారెడ్డి జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభులింగం మాట్లాడుతూ బ్యాంకింగ్ రెగ్యులేషన్ సవరణ చట్టం 2020లోని సెక్షన్ 12-1, రాష్ట్ర సహకార సంఘాల సవరణ చట్టం 2023లోని సెక్షన్ 26ను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సుధీర్, శివరాజ్, బుచ్చయ్య, జంగయ్య, మహిళా సంఘం నాయకులు చిలుకమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

### జేపీదర్గాలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రార్థనలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న వీర్లపల్లి శంకర్

కొత్తూరు: ఇన్ముల్‌నర్వ గ్రామంలోని జేపీదర్గాను గురువారం షాద్‌నగర్ కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బాబాకు చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇన్ముల్‌నర్వ గ్రామానికి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ బాబా ఆశీస్సులతో కాంగ్రెస్ విజయం సాధిస్తే తనవంతుగా దర్గా అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాబర్‌ఖాన్, శ్రీకాంత్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, రవికుమార్‌గుప్తా, కుమార్‌గౌడ్, శ్రీశైలం, అశోక్, అర్జున్, లక్ష్మణ్, శ్రీనునాయక్, రూప్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

కందుకూరు: వచ్చే ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని పీసీసీ ఎన్నికల ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాతనర్సింహారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్ ఆధ్వర్యంలో కటికపల్లి, గూడూరు, లేమూరు, దావూద్‌గూడల్లో గడప గడపకు కాంగ్రెస్ నిర్వహించారు. తాము అధికారంలోకి వస్తే ప్రజలకు ఏఏ పథకాలు అమలు చేయనున్నది వారు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, అందరూ కాంగ్రెస్‌నే బలపర్చాలని కోరారు. లేమూరు నుంచి మాజీ సర్పంచ్ గూడూరు కొండారెడ్డి, కటికపల్లి, గూడూరుల నుంచి వివిధ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

# గెలుపుపై ఎవరి ధీమా వారిదే

- పోటా పోటీగా ప్రచారం
- ఇంటింటికీ కాంగ్రెస్, బీఆర్ఎస్
- ప్రతీ కార్యకర్తను కలుస్తున్న ఇరుపార్టీల నాయకులు



నందిగామ: ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో మండల కేంద్రమైన నందిగామతో పాటు పలు గ్రామాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రచారాలను ముమ్మరం చేశాయి. అభివృద్ధి చేశాం.. ఆదరించండి.. అంటూ బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రతీ ఇంటికి తిరుగుతున్నారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తెస్తే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఆ పార్టీ నేతలు ప్రచార అస్త్రాన్ని సంధిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాలలో ఆయా పార్టీల ముఖ్యనేతలు ఇంటింటి ప్రచారాలు నిర్వహిస్తు పార్టీకి సంబంధించిన కర పత్రాలు పంపిణీ చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ ఆయా పార్టీల నేతలు ఓటర్లను ఆకట్టుకునేందుకు ఇంటింటి ప్రచారంలో పాల్గొంటున్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతిని ఎండగడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టబోయే పథకాలను వివరిస్తున్నారు.

**ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రచారం..**

ఉదయం మొదలు ప్రచారాలకు శ్రీకారం చుడుతున్న ఆయా పార్టీల నేతలు ఓటర్లను ఆకట్టుకునే పనిలో పడ్డారు. తాము చేసిన పనులను చెబుతూ, తమని మరోసారి అధికారంలోకి తెస్తే మరింతా అభివృద్ధి చేసి చూపుతామని బీఆర్ఎస్ నాయకులు చెబుతుండగా, తమ పార్టీని గెలిపించినట్లయితే చేయబోయే పనులను కాంగ్రెస్ నాయకులు ఓటర్లకు వివరిస్తున్నారు. ఉదయం సుమారు రెండు, మూడు గంటల పాటు ప్రచారం నిర్వహిస్తున్నా నేతలు సాయంత్రం సైతం మరో రెండు, మూడు గంటలు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. దీంతో గ్రామాలలో రాజకీయ సందడి కనిపిస్తోంది.

**ప్రచారంలో డీలా పడిన బీజేపీ..**

అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ తమ అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించడంతో ఆ పార్టీల నేతలు ప్రచారంలో దూసుకుపోతుండగా బీజేపీ మాత్రం డీలా పడినట్లు కనిపిస్తోంది. బీజేపీ ఇప్పటికి అభ్యర్థిని ప్రకటించకపోవడంతో ఆ పార్టీ నేతలు ప్రచారంలో వెనుకంజలో ఉండిపోయారు.



నర్సప్పగూడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు

# బాలాత్రిపుర దేవిగా అమ్మవారు



షాబాద్: దుర్గామాతకు పూజలు చేస్తున్న గ్రామస్తులు



షాద్‌నగర్: బాలాత్రిపుర దేవిగా అమ్మవారు

షాద్‌నగర్: దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలను షాద్‌నగర్ పట్టణంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం శ్రీ శివమారుతీ దేవాలయం, కన్యకాపరమేశ్వరీ దేవాలయం, పట్టణ శివారులోని బైపాస్ యమ్మీ హోటల్ వద్ద ఉన్న బంగారు మైసమ్మ, ఎలికట్టలోని అంబభవానీ మాత దేవాలయాల్లో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆయా దేవాలయాల్లో అమ్మవారిని బాలాత్రిపుర దేవిగా అలకరించారు.

**షాబాద్‌లో**

షాబాద్: షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో దుర్గామాతకు మేకలకృష్ణయ్య, యాచం రాజు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు రాజు, నవీన్, శ్రవణ్, ఉమారాణి, స్నేహ, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌తోనే మైనార్టీల సంక్షేమం



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న పారిజాత నర్సింహా రెడ్డి

పహాడీషరీఫ్: మైనార్టీల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని పీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహా రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన గ్యారంటీ పథకాలు, బీఆర్ఎస్ వ్యతిరేకతతో ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లోకి చేరుతున్నారని బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహా రెడ్డి తెలిపారు. జల్‌పల్లి మున్సిపాలిటీ 3వ వార్డు డ్రీమ్ సిటీలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముస్లింల ప్రగతి కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ జిల్లా నాయకులు రియాజ్ ఖాన్, బీఎంసీ మైనార్టీ చైర్మన్ సయ్యద్ అఫ్జల్ అహ్మద్, ఉపాధ్యక్షుడు మహ్మద్, అబ్దుల్ బారీ, బాబా తదితరులు పాల్గొన్నారు.

### నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

చేవెళ్ల: నేడు బీఆర్ఎస్ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు ప్రభాకర్ తెలిపారు. చేవెళ్ల మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ఉంటుందని తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే కాలె యాదయ్యలు ఈ సమావేశానికి హాజరవుతారని తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గంలోని ముఖ్యనాయకులు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

### మాజీ చైర్మన్‌కు పరామర్శ

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌కు చెందిన బడంగ్‌పేట్ నగర పంచాయతీ మాజీ చైర్మన్ యాతం శ్రీశైలం యాదవ్‌ను గురువారం మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆనంద్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, బండారి అశోక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బూత్‌స్థాయి నుంచి బీజేపీ బలంగా ఉంది



సమావేశంలో బీజేపీ నాయకులు

చేవెళ్ల: మండలంలో బూత్‌స్థాయి నుంచి బీజేపీ బలంగా ఉందని, కార్యకర్తలు చురుకుగా పనిచేస్తున్నారని మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి అన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని దేవునిఎర్రవల్లి గ్రామంలో గురువారం బూత్‌స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవునిఎర్రవల్లి గ్రామంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎవరు కూడా పార్టీ మారరని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు అనవసరంగా అసత్య ప్రచారం చేస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించుకునేందుకు బూత్‌స్థాయి నుంచి ప్రతీఒక్కరు కష్టపడి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గ్రామాల్లో ప్రజల వద్దకు బీజేపీని గెలిపించేందుకు పనిచేయాలని సూచించారు. బీజేపీని అధికారంలోకి తీసుకొస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎవరిని ప్రకటించినా గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి, సామా రంగారెడ్డి, క్రిష్ణగౌడ్, శ్రీనివాస్, పత్తి సత్యనారాయణ, బోజిరెడ్డి, రవీందర్, బూత్‌స్థాయి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లోకి కొందుర్గు నేతలు



కాంగ్రెస్‌లో చేరుతున్న కొందుర్గు గ్రామస్తులు

కొందుర్గు: కొందుర్గు మండల కేంద్రానికి చెందిన వివిధ పార్టీల నాయకులు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. మాజీ సర్పంచ్ పెంటయ్య, బీఆర్ఎస్ నాయకులు మానయ్య ఆధ్వర్యంలో 50మంది నాయకులు పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరినట్లు కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల కమిటీ అధ్యక్షుడు నరేందర్ తెలిపారు. వీర్లపల్లి శంకర్ వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కావలి యాదయ్య, జీబీ కృష్ణ, మల్లేశ్ గౌడ్, ప్రసాద్, చిన్నయ్య, బావయ్య, నర్సింలు, శ్రీకాంత్, ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



కందుకూరులో వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కందుకూరు: మాదిగల సమస్యలు, హక్కుల పరిరక్షణ కోసం ఎమ్మార్పీఎస్ నవంబర్ 5వ తేదీన చేపట్టనున్న చలో ఇందిరా పార్కు జయభేరి సభ విజయవంతం చేయాలని కోరుతూ గురువారం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు చిన్నగళ్ల యాదగిరి మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు మాదిగ డిక్లరేషన్‌ను ప్రకటించాలన్నారు. డప్పు, చెప్పు వృత్తిదారులకు రూ.4వేలు పింఛన్, ప్రతీదళిత కుటుంబానికి దళిత బంధు, మంత్రి వర్గంలో మాదిగలకు సముచిత స్థానం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొర్ర రాములు, గడ్డం రాంచంద్రి, ఊటు మల్లేశ్, బాల్‌రాజ్, కె.రాములు, కె.ఎల్లయ్య, బి.అశోక్, కంద నరేష్, ఎం.క్రిష్ణ, కంద పెద్ద నర్సింహ పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం

- ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



కండువా కప్పి ఆహ్వానిస్తున్న అంజయ్యయాదవ్

షాద్‌నగర్‌రూరల్: ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయమని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో వివిధ పార్టీల కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. నిరుపేదల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే చెల్లిందన్నారు. రెండు పర్యాయాలు సీఎం కేసీఆర్‌ని ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారన్నారు. మూడోసారి గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాయిప్రసాద్ యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బీజేపీకి అధికారం ఖాయం

- పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



బీజేపీలో చేరిన యువకులు

షాద్‌నగర్: బీజేపీ అఖండ విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్, బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామానికి చెందిన పలువురు యువకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలోని సాయిబాలాజీ టౌన్ షిప్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి విష్ణువర్ధన్‌రెడ్డి, అందెబాబయ్యలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మాయమాటలు చెప్పి ఓట్లు దండు కొని తొమ్మిదేళ్లుగా రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. రోజు రోజుకు బీజేపీపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందన్నారు. రాబోవు ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరడం ఖాయమని జోస్యం చెప్పారు. రమేశ్, యాదగిరి, నర్సింహ్మా, పెంటయ్య, ఇలియాస్, సాబేర్, వెంకటేశ్, అలీ, అబ్దుల్‌ఖాన్, వెంకటేశ్, రాజు, సురేశ్, నవీన్, కార్తీక్ తదితరులు పార్టీలో చేరారు. మోహన్ సింగ్, లష్కర్ నాయక్, ఇస్నాతి శ్రీనివాస్, శ్యాం సుందర్‌రెడ్డి, చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి, వంశీకృష్ణ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



### పూర్వ విద్యార్థుల సమ్మేళనం

షాద్‌నగర్: కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997-98 పదో తరగతి చదవిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గురువారం షాద్‌నగర్ పట్టణంలోని బాబా దాబా హోటల్‌లోని మినీ కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాటి జ్ఞాపకాలను ఒకరినొకరు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో రఘునందన్, చంద్రారెడ్డి, విజయ్‌కుమార్, వినోద్ కుమార్, రాంచంద్రారెడ్డి, అనురాధ, నీరజ, వరలక్ష్మి, కవిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణకు బీజేపీ మద్దతు



మందకృష్ణను సన్మానిస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

బడంగ్‌పేట్: ఎస్సీ వర్గీకరణకు బీజేపీ మద్దతిస్తుందని మహేశ్వరం నియోజకర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆలంపూర్ నుంచి హైదరాబాద్‌కు చేపట్టిన పాదయాత్ర గురువారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మల్లాపూర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా కడాది బీరప్ప ఫంక్షన్‌హాల్‌లో బస చేసిన మందకృష్ణను బీజేపీ మహేశ్వరం నియోజకర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు తమ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. ఏండ్ల తరబడి పోరాడుతున్న మందకృష్ణ మాదిగ ఆశయం నేరవేరాలని ఆయన కోరారు. వర్గీకరణతోనే మాదిగలకు తగిన న్యాయం జరుగుతుందని మందకృష్ణమాదిగ అన్నారు. వర్గీకరణకోసం తను ఎంతటి పోరాటం చేయడానికైనా సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. అనంతరం మందకృష్ణను అందెల శాలువా కప్పి సత్కరించి పాదయాత్రకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఎస్సీమోర్చ నాయకులు గడ్డం వెంకటేశ్, చిత్రం శ్రీను, యాదగిరి పాల్గొన్నారు.

# భక్తుల పాలిట కొంగుబంగారం



అమ్మవారి పూజలో పాల్గొన్న ఆలయ ధర్మకర్త, మహిళలు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ మండల కేంద్రం పంజాల అనిల్‌కుమార్ కాలనీలో వెలసిన శ్రీ విజయ దుర్గాదేవి అమ్మవారి దేవాలయం భక్తుల పాలిట కొంగుబంగారంగా మారింది. మూడేళ్ల క్రితం కొలువుదీరిన ఈ ఆలయంలో దుర్గామాత నిత్యం పూజలు అందుకుంటోంది. ఆలయంలో వార్షికోత్సవ వేడుకలతో పాటు గణపతి ఉత్సవాలు, దేవి నవరాత్రులు, మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. దేవి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారిని అన్నపూర్ణమాత రూపంలో అలంకరణ చేశారు. 101 రకాల వంటకాలు నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ధర్మకర్త ఇంటూరి విద్యారెడ్డి మాట్లాడుతూ ఆలయ దర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు స్వప్నజ్యోతి, శ్వేత, సరిత, ఇంటూరి అంకిరెడ్డి, రుషిగుప్తా పాల్గొన్నారు.

# దేశంలోనే ఆదర్శం తెలంగాణ

- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



మంత్రి సమక్షంలో పార్టీలో చేరిన బీజేపీ కార్యకర్తలు

పహాడీషరీఫ్: దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని, కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయాలని మహేశ్వరం ఎమ్మెల్యే, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ జల్‌పల్లి మున్సిపాలిటీ యూత్ వింగ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు యంజాల అర్జున్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలు మంత్రి సమక్షంలో గురువారం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతీగడపకు అందాయన్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టో పట్ల పేదలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి కో-ఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డి, పార్టీ మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ యంజాల జనార్దన్, ఉపాధ్యక్షుడు దూడల శ్రీనివాస్ గౌడ్, నగేశ్ ముదిరాజ్, సూరెడ్డి గోపాల్ రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.